మమకారం

# బ్రిడ్జి నారాయణగారు




బయట వాతావరణం మబ్బు పట్టి ఉంది.

వానెలిసి ఐదు నిముషాలైనా కాలేదు. పక్షులు ఆకాశంలో అటూ ఇటూ ఎగురుతున్నాయి.

కిటికీ వారనున్న చింతచెట్టు ఆకుల్లోంచి మంచు బిందువుల్లా వర్షం తాలూకూ నీళ్ళు జాలువారుతున్నాయి.

లోపల పడక కుర్చీలోంచి బయట చింత చెట్టు వైపు చూస్తున్న నారాయణ గారికి బ్రిడ్జి మీదకి దృష్టి మళ్ళి గుండెంతా బాధతో మూల్గింది.

నారాయణ గారింటికి బ్రిడ్జి ఒక ఫర్లాంగు దూరం ఉంటుంది. నారాయణ గారికి బ్రిడ్జి ఇరవై మూడో ఏట నుంచి తెలుసు. ఆయన వయస్సు ఇప్పుడు ఏభై.

ఆయన ఇరవై మూడో సంవత్సరంలో ఉద్యోగ రీత్యా ఈ ఊరొచ్చారు. హైవే రోడ్డున ఆనుకొనియున్న ఈ ఊరికి మధ్య లోనే బ్రిడ్జి ఉంది.

ప్రతి సాయంత్రం ఆ బ్రిడ్జి మీదకెళ్ళి కూర్చుని రావడం నారాయణ గారికి ఈ ఊరు వచ్చినప్పట్నుంచి ఉన్న అలవాటు.

అలవాటుగా ఆ సాయంత్రం బ్రిడ్జి మీదకి వచ్చారాయన. అక్కడ కూర్చోగానే గతం నుంచి తవ్వుకుంటున్న అనుభవాలు కళ్ళ ముందు కదలాడి— బ్రిడ్జిని, ఆయన్ని వెక్కిరించి వట్టనిపించింది.

తన ఇరవై ఐదో ఏట ఇక్కడ కూర్చుని ఉండగానే బస్సులోంచి వెళ్తున్న ఎవరో అమ్మాయి రోజూ అదే టైముకి చేయి ఊపేది.

ముచ్చటగా ముసిముసిగా చూస్తూ న వ్వేది. ఆ ఆనందం ఎన్నాళ్ళో లేకుండానే ఆ బ్రిడ్జి ప్రక్కన జరిగిన బస్సు ఏక్సిడెంట్‌లో ఆమె మరణించింది.

ఒక సంవత్సరం బ్రేకులు ఫెయిలయి, మోటార్ సైకిల్ మీద నుంచి గుంతలో పడిపోయి కాళ్ళూ, చేతులు విరగ్గొట్టుకున్న భార్యా, భర్తల్ని తను ఆటో తీసుకొచ్చి హాస్పిటల్‌కి తీసుకు వెళ్ళారాయన.

ఇక్కడే తన భార్య 'శశి'తో ప్రేమ కలాపాలు సాగించి పెళ్ళి చేసుకుంది.

ఈ బ్రిడ్జికి ఇవతలి వైపు పర్వీ తోటల్లో రోజూ ఎంతో మంది ప్రేమికుల జంటల్ని చూసారు, చూస్తూనే ఉన్నారాయన.

ఇక్కడ్నుంచే కనబడే ఏరోడ్రోమ్.

కానీ! ఈ బ్రిడ్జి గురించి బెంగంతా అది కూలిపోయే స్టేజీలోకి రావడమే. ఒక ప్రక్క వరిగిపోతే, మరొక ప్రక్కనుంచి వాహనాలు నడుస్తున్నాయి. ఈ బ్రిడ్జిని తీసేసి క్రొత్త బ్రిడ్జిని వెయ్యవలసిన సమయం ఆసన్నమైంది.

ఈ బ్రిడ్జి, ఈ జ్ఞాపకాల బ్రిడ్జి కాలంలో కల్సిపోతుంది. మరి! తను ఇక నాల్రోజులలో రిటైర్ అయిపోతున్నాడు. మరి కొన్నాళ్ళలో తను ఎలాగూ తనువు చాలించక తప్పదు. ఈ ఆలోచన రాగానే గుండె చివుక్కుమంది నారాయణ గారికి.

ఆ రోజు రిటైర్‌మెంట్ సందర్భంగా ఆఫీసు ఫంక్షన్‌లో ఆయన్ని ఘనంగా సత్కరించారు. నాలుగున్నరకే ఆయన ఇంటికి వచ్చేశారు.

యమ్. మల్లికార్జునరావు.

ఎడ తెగని ఆలోచన్లు ఆయన్ని బ్రిడ్జి దగ్గరికి తీసుకెళ్ళాయి. రోజూలాగే ఆయన బ్రిడ్జి దగ్గరకు వెళ్ళారు.

తను ఒక గాంధీలాంటి వాడు కాదు— తనని జనం గుర్తుంచుకోవడానికి. ఈ రోజు ఆఫీసులో జరిగిన ఫంక్షన్‌తో అందరూ తనని మర్చిపోతారు.

మనస్సంతా బాధతో మూల్గుతోంది. అర్థం కాని వేదనతో రోదిస్తోంది.

చరిత్రలో ఎన్ని కట్టడాలు నేలకొరగ లేదు. ఎంతమంది గొప్ప వ్యక్తులు కాల గర్భంలో కల్సిపోలేదు. తనొక లెక్కా! అని, మనస్సులో చిన్న ఊరడింపు కలిగింది.

సృష్టిలో జీవమున్న ప్రతి పదార్థం, జీవుల్తో సృష్టింప బడిన వస్తువులు తమ పరిమితి దాటగానే ఉనికిని కోల్పోతాయి.

ఒక గొప్ప వ్యక్తి పోతే పదికాలాల పాటు జనం గుర్తుంచుకుంటారు. ఒక గొప్ప కట్టడం కూలిపోతే చరిత్రలో లిఖించబడుతుంది.

ఒక మామూలు వ్యక్తి తనువు చాలిస్తే ఈ సమాజం పట్టించుకోదు. పట్టించుకోవలసిన అవసరం కూడా లేదు. ఎంతో మంది నిత్యం అనంత వాయువుల్లో కల్సిపోతుంటారు. అందర్నీ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఈ సమాజానికి లేదు. సమాజం గురించి పాటుపడిన వ్యక్తిని గుర్తుంచుకోవలసిన అవసరం సమాజానికుంది.

తనొక మామూలు వ్యక్తిలాగానే తన బాధ్యత నెరవేర్చాడు.

ఎంతో మంది వ్యక్తులు పోతున్నారు.

వాళ్ళ ఆశలు పోతున్నాయి.

సమాజ ఉన్నతికై—

ఆశయాల్ని సాధించిన వ్యక్తులు చరిత్రలో లిఖించబడుతున్నారు.

నారాయణ గారు ఏవో ఆలోచన్లలో పడిపోయారు. ఆలోచన్లకి అంతరాయంగా స్తబ్దతగా మారిపోయిన గుండె గడియారం.

నిశ్శబ్దంగా బ్రిడ్జి ప్రహరీ గోడకు ఆనుకు పోయారు నారాయణగారు.

బ్రిడ్జేమో మౌనంగా దుఃఖిస్తున్నట్టుంది.

అరుచుకుంటూ వెళ్తున్న కాకి— కబురు కోసం వెళ్తున్నట్టుంది. ప్రకృతంతా సంతాపం తెలుపుతున్నట్టు స్మశానంలా ఉంది. కాలం నాకిలాంటివి మామూలే, అన్నట్టు సాగి పోతోంది.

*